ఈనాడు
పశ్చిమగోదావరి
గురువారం సెప్టెంబరు 26, 2024 5



☛ భీమవరం మండలం చినఅమిరంలో వైకాపా నాయకుడి పొలం సమీపాన ఎన్నికలకు ముందు పంచాయతీ నిధులు రూ.11 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి ఇది. సమీపాన ఇళ్లు లేవు. అవతలి పేటలోకి వెళ్లేందుకు ఈ రోడ్డు వేశామని కొందరు వైకాపా నాయకులు బుకాయిస్తున్నారు. అదే నిజమైతే ఆ పేట వరకు కాకుండా సదరు నాయకుడి పొలం వద్దే నిర్మాణాన్ని ఎందుకు ఆపేశారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మరోపక్క ఆ పేటకు చేరేందుకు ప్రధాన రహదారి నుంచి అసలైన చక్కటి మార్గం ఉండనే ఉంది.

☛ ఇదే ప్రాంతంలో ప్రధాన రహదారి నుంచి కాలువ వెంబడి చివరి వరకు రూ.24 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. సమీపాన ఉన్న వృద్ధాశ్రమం తరఫున నిర్మించే కల్యాణ మండపం నిమిత్తం ఈ రోడ్డు వేసినట్లు చెబుతున్నా అక్కడికి వెళ్లేందుకు కాలువకు కుడివైపు నుంచి చక్కటి మార్గం ఉంది. కేవలం ఆ ఒక్క నిర్మాణం కోసమే పంచాయతీ సొమ్ము ఎందుకు ఖర్చు చేశారో దానికి సరైన సమాధానం దొరకడం లేదు.

ప్రజాధనం పక్కదారి!

☛ వైకాపా వర్గీయులకు లబ్ధి చేకూర్చేలా సీసీ రోడ్లు ☛ అవసరమైన ప్రాంతాలకు మొండి చేయి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే

మళ్లీ అడిగేవారు.. ఆపేవారు ఎవ్వరున్నారని అడ్డగోలుగా వ్యవహరించారు నాటి వైకాపా పాలకులు. వారు తానా.. అంటే తందానా అంటూ వ్యవహరించారు కొందరు అధికారులు. ఆ పార్టీ నాయకులు, వర్గీయులకు లబ్ధి చేకూర్చేలా రూ.లక్షల వ్యయంతో అడ్డగోలుగా సీసీ రోడ్లు నిర్మించారు. కొన్నిచోట్ల వారి పొలాల్లోకి, స్థిరాస్తి వెంచర్లకు చేరుకునేందుకు పంచాయతీ సొమ్ము వెచ్చించారు. చాలా గ్రామాల్లో జనావాసాల మధ్య సరైన రహదారుల్లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతుండగా అలాంటి ప్రాంతాలకు మాత్రం మొండి చేయి చూపారు. అప్పట్లో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది నాటి నాయకులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహరించారని.. ఇదంతా తెలిసినా ఉన్నతాధికారులు నోరు మెదపలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత అయిదేళ్లలో నిర్మించిన సీసీ రహదారుల సంఖ్య పరిశీలిస్తే వాటిలో అధికశాతం ఆ పార్టీ నాయకుల ప్రయోజనాల కోసమేనని ఆరోపణలున్నాయి.

గత అయిదేళ్లలో నిర్మించిన సీసీ రోడ్ల వివరాలు

డివిజన్	సంఖ్య	కిలోమీటర్లు
నరసాపురం	216	91.424
భీమవరం	265	124.722



భీమవరం మండలం రాయలంలో వైకాపా నాయకులు గతంలో వేసిన అనధికార లేఅవుట్ ఇది. పంచాయతీకి పదిశాతం భూమి ఇవ్వలేదు. కనీస నిబంధనలు పాటించలేదు. కానీ పంచాయతీ సొమ్ము రూ.16.80 లక్షలతో ఇక్కడికి అడ్డగోలుగా సీసీ రోడ్డు నిర్మించారు. ఈ వ్యవహారంలో నాటి ఇన్‌ఛార్జి కార్యదర్శి పాత్రపై ఆరోపణలు వచ్చాయి. ఆయనే చివరకు సంబంధిత కార్యదర్శి కావడం విశేషం. ఈ గ్రామంలో మరికొన్ని అనధికార లేఅవుట్లలో ఇష్టారాజ్యంగా సీసీ రహదారులు నిర్మించారని ఆరోపణలున్నాయి.



కొత్తపూసలమూరు గ్రామంలో ఇళ్ల మధ్య అంతర్గత రహదారి దుస్థితి. ఈ గ్రామంలో ఇలాంటి నాలుగు ప్రధాన వీధుల్లో ఇదొకటి. ఇక్కడ రోడ్డు నిర్మించాలని ప్రజలు ఎన్నిసార్లు విన్నవించినా అప్పటి వైకాపా పాలకులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు.

శాఖాపరంగా చర్యలు.. నిబంధనల మేరకు ప్రజలకు ఉపయోగపడే ప్రాంతాల్లో మాత్రమే రోడ్లు నిర్మించాలి. అనధికార లేఅవుట్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచాయతీ సొమ్ముతో రోడ్లు, తాగునీటి పైపులైన్లు వేయకూడదు. అలాంటి పనులు గతంలో చేసినట్లు మాకు ఫిర్యాదులు అందితే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం.
- ఆర్. విక్టర్, జిల్లా పంచాయతీ అధికారి

ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ


భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కమిటీ సమావేశంతో కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 26న భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సిబ్బందికి తొలి విడత శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు.



ఈనాడు, ఏలూరు, జంగారెడ్డిగూడెం పట్టణం: అడవే కదా.. అడిగేదెవరు.. అడ్డుకునేదెవరూ అన్నట్లు ఉంది అక్రమార్కుల తీరు. జిల్లాలో అడవుల నరికివేత యథేచ్ఛగా సాగుతోంది. చెక్‌పోస్టులున్నా.. సిబ్బంది విధుల్లో ఉన్నా..వేలాది చెట్లు అడ్డగోలుగా నరికేస్తున్నారు. అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పొగాకు బ్యారన్‌లే ఆదాయ వనరులు.. నరికిన కలపను ఎక్కువగా పొగాకు బ్యారన్‌లకు తరలిస్తున్నారు. ఇందులో జీడిమామిడి, జామాయిల్, నిద్రగన్నేరు వంటి చెట్లు ఎక్కువగా రవాణా చేస్తున్నారు. ఒక బ్యారన్‌లో పొగాకు ఉడికించేందుకు దాదాపు 25 టన్నుల కలప అవసరం ఉంటుంది. దీంతో గోపాలపురం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి మండలాలకు భారీగా రవాణా జరుగుతోంది.

అడవే కదా.. అడిగేదెవరని..



☛ ఈ చిత్రంలో కనిపిస్తున్న కలప ట్రాక్టర్ జంగారెడ్డిగూడెం పొగాకు బ్యారన్‌కు కలప తీసుకొచ్చింది. వేలేరుపాడు మండలం గుల్లమడుగు, సిద్ధారం పరిధిలోని అడవిలో అక్రమ కలప రవాణా జోరుగా సాగుతోంది. పెద్దపెద్ద చెట్లను రాత్రుళ్లు నరికి ఇలా వాహనాల్లో ఎక్కిస్తున్నారు. వీటిని జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గోపాలపురంలోని పొగాకు బ్యారన్‌లకు తరలిస్తున్నారు.

☛ ఇది జంగారెడ్డిగూడెంలోని ఓ పొగాకు బ్యారెన్‌లోని కలప. ఈ నిర్వాహకుడు తరచూ వేలేరుపాడు మండలంలోని అడవుల నుంచి రాత్రుళ్లు కలప తీసుకొస్తున్నారు. గత అయిదేళ్ల నుంచి స్థానికంగా ఓ వైకాపా నాయకుడి అనుచరుడి ద్వారానే రవాణా జరుగుతోంది. ప్రభుత్వం మారినా అటవీశాఖ అధికారుల తీరు మారకపోవటంతో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

☛ కుక్కునూరు మండలం వెంకటాపురం, సీతారామనగరంలోని అటవీ ప్రాంతంలో యథేచ్ఛగా చెట్లు నరికేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులోని కావిడిగుడ్లలోనూ పరిసరాల్లోనూ ఇదే తంతు. భారీ వాహనాల్లో ఎక్కించి తెలంగాణ రాష్ట్రానికి తరలించి టన్ను రూ.3 వేల వరకు సొమ్ము చేసుకుంటున్నారు.

అడ్డగోలుగా.. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష హెక్టార్ల వరకు అటవీ భూమి ఉంది. క్షేత్రస్థాయిలో చూస్తే అడవులను అడ్డగోలు నరికేస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, టి.నరసాపురం, చింతలపూడి మండలాల పరిధిలో దాదాపు అన్నిచోట్ల చెట్లు నరికి, దుంగలను వాహనాల్లో తరలిస్తున్నారు. టన్నుకు రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం ఆయా ప్రాంతాల్లో మండల స్థాయి నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోంది. గత అయిదేళ్లలో 15 వేల ఎకరాలకు పైనే అడవులను నరికి తరలించేశారు.

నెలవారీ మామూళ్ల కోసం.. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మన్యంలో 5 వరకు తనిఖీ కేంద్రాలున్నాయి. వంద మందికి పైగా సిబ్బంది గస్తీ కాస్తుంటారు. అయినా కలప నిరాటంకంగా తరలిపోతోంది. అటవీ శాఖలో కొందరు అధికారులు, కింది స్థాయి సిబ్బంది నెలవారీ మామూళ్లు మాట్లాడుకుని వాహనాలను వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా కలప వాహనాలపై ఫిర్యాదు చేసినా. అవి పట్టా భూముల్లో నరికినవే అంటూ బుకాయిస్తున్నారు. ఈ అంశమై కలెక్టర్ వెట్రిసెల్విని వివరణ కోరగా అడవుల నరికివేతను అరికడతామని, చెక్‌పోస్టులు బలోపేతం చేసేలా అధికారులకు ఆదేశాలిస్తామని తెలిపారు.

బినామీలకు చోటివ్వొద్దు

మద్యం దుకాణాలపై బీసీ సంఘాల విజ్ఞప్తి


మాట్లాడుతున్న పితాని

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల్లో బీసీలకు 10 శాతం కేటాయింపు హర్షణీయమని ఆచంట ఎమ్మెల్యే, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ అన్నారు. గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ తదితర గీతవృత్తి కుల సంఘాల నాయకులతో సమావేశం భీమవరంలో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పితాని మాట్లాడుతూ మద్యం వ్యాపారంలో కల్లుగీత కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ ఎప్పట్నుంచో ఉన్నా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, భాజపా నాయకులు ఇప్పుడు 10 శాతం దుకాణాలు కేటాయించడం శుభపరిణామని, భవిష్యత్తులో దీన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కులాల్లో విద్యావంతులైన యువతలో నిరుద్యోగులకు ఈ వ్యాపారం ద్వారా ఉపాధి కలిగేలా చూడ్డామన్నారు. ఆర్థిక భారం లేకుండా రూ.2 లక్షల డిపాజిట్‌ను 50 శాతం మేర తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానన్నారు. పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ బీసీలకు కేటాయించే దుకాణాల్లో బినామీలకు అవకాశం లేకుండా చూడాలని కోరారు.

రైతు వ్యధ వినేందుకు పద!




వారానికి 2 రోజులు క్షేత్రంలో అధికారులు ● అధిక దిగుబడుల సాధనకు ఆసరా

పాలకొల్లు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ పాలనలో రైతులకు రాయితీపై పరికరాల పంపిణీ ఎత్తేశారు. వరిలో ముడి జింకు నుంచి నారుకు విత్తనాల వరకు సరఫరా ఆపేశారు. భూసార పరీక్షలు మానేశారు. చివరికి పండించిన పంటను అమ్ముకోవడానికి స్వేచ్ఛ లేకుండా చేసేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయంపై దృష్టి సారించింది. అన్నదాతలకు ఆసరాగా నిలవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, సేంద్రియ, మార్కెటింగ్ శాఖ అధికారుల బృందాన్ని పొలం గట్టుకే పంపిస్తోంది. 'పొలం పిలుస్తోంది' పేరిట ప్రతి మంగళ, బుధవారాల్లో అధికార యంత్రాంగం రైతుల దగ్గరకే వెళ్లేలా రూపొందించిన కార్యక్రమం ఈ నెల 24న ఉమ్మడి జిల్లాలో ఆరంభమైంది.

సత్ఫలితాల సాధనకు.. వాతావరణం అనుకూలించక అన్నదాతలకు సాగు భారంగా మారింది. ఈ క్రమంలో రైతులను నూతన విధానాల వైపు మళ్లించి సాగు వ్యయం తగ్గించి ఆశించిన ఫలితాలను సాధించడమే 'పొలం పిలుస్తోంది' లక్ష్యం. ఇందు కోసం ప్రాంతాల వారీగా అవసరమైన సూచనలు చేయడం, భూసార పరీక్షలు నిర్వహించేలా ప్రోత్సహించడం ఆయా శాఖల అధికారులు చేయాల్సి ఉంది. ఎరువుల పిచికారికి కిసాన్ డ్రోన్లను వినియోగించడం, కౌలు రైతు కార్డులు మంజూరు, రైతుమిత్ర సంఘాల ఏర్పాటు వంటి విషయాలపై రైతులను చైతన్య పరుస్తారు. ఖరీఫ్, రబీ పంట కాలంలో నాలుగు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ఉమ్మడి జిల్లాలోని 48 మండలాల్లో కొనసాగనుంది.

నిధుల కేటాయింపు.. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. దీనిపై పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వరరావును సంప్రదించగా మండలాల వారీగా బడ్జెట్ కేటాయింపు ఉంటుందన్నారు. అవసరం మేరకు చేసిన వ్యయానికి ఆయా మండలాల అధికారులు బిల్లులు పెట్టుకోవాలని చెప్పారు.



12 లక్షలు మొత్తం రైతులు

గంజాయి మూలాలపై ప్రత్యేక దృష్టి: ఐజీ


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పోలవరం, న్యూస్‌టుడే: గంజాయి కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు పట్టుబడుతున్నారని, వారి మూలాలపై దృష్టి పెట్టామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలవరం డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం సబ్‌డివిజన్ పరిధిలో పోక్సో కేసులు, కొయ్యలగూడెం-జీలుగుమిల్లి జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నట్లు గుర్తించామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారన్నారు. ఎవరైనా నగదు పోగొట్టుకుంటే మూడు గంటల్లో ట్రోల్‌ఫ్రీ నంబరు 1930కి లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు పాపికొండల అభయారణ్యంలో ప్రవేశించే అవకాశం ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. అక్కడి పరిణామాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించడంతోపాటు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలపై నిఘా ఉంచామన్నారు. ఆయా స్టేషన్లలో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. అనంతరం ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. పోలవరం పోలీస్‌స్టేషన్‌తోపాటు నూతన భవన నిర్మాణాన్ని ఐజీ పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐలు తదితరులున్నారు.

ఏలూరు 7 పశ్చిమ 6

☛ పూర్వ విధానంలోనే ఆబ్కారీ స్టేషన్లు
☛ బదిలీల ప్రక్రియ కొలిక్కి



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నూతన విధానంలో భాగంగా ఎస్‌ఈబీ స్థానంలో ఆబ్కారీ శాఖను పునర్ వ్యవస్థీకరించారు. డిస్టిలరీలతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పరిపాలన విభాగం, తనిఖీ కేంద్రాలకు సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2020కు ముందున్న ఎక్సైజ్‌శాఖ స్వరూపాన్ని ఇప్పుడు పునరుద్ధరించారు. పర్యవేక్షణ, నియంత్రణ, పరిపాలన బాధ్యతలను ఎక్సైజ్ కమిషనర్‌కు అప్పగించారు.

ఉప కమిషనర్ నియామకం.. ప్రస్తుతం కర్నూలులో పనిచేస్తున్న బి.శ్రీలతను ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు కలిపి ఉప కమిషనర్‌గా నియమించారు. అదనపు కమిషనర్‌గా భీమవరంలో ఇదే హోదాలో పనిచేస్తున్న కేవీ నాగప్రభుకుమార్‌ను నియమించారు. ఏలూరు డీపీఈవో ఆర్ఎస్ కుమరేశ్వరన్‌ను భీమవరానికి, కృష్ణా జిల్లా డీపీఈవో ఎ.ఆవులయ్యను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ● గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఉన్నట్లుగానే పాత విధానంలోకి ఆబ్కారీ స్టేషన్లు వచ్చాయి. ఏలూరు జిల్లాకు 7, పశ్చిమగోదావరి జిల్లాకు 6 చొప్పున స్టేషన్లు ఉన్నాయి. మద్యం డిపోలను గతంలో ఉన్నట్లుగానే కేటాయించారు.

నిండుకున్న మద్యం నిల్వలు.. నూతన విధానంలో భాగంగా అక్టోబరు 1 నుంచి కొత్తగా మద్యం దుకాణాలు ఏర్పాటుకు ప్రభుత్వ రంగం సిద్ధం చేస్తోంది. దుకాణాల కేటాయింపు, రుసుములపై ఉత్తర్వులు ఒకటి రెండు రోజుల్లో వెలువడవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ దుకాణాల్లో చాలా చోట్ల సరకు నిల్వలు చివరి దశకు చేరినట్లు సమాచారం. దీంతో కొన్ని చోట్ల మద్యం లేదంటూ బోర్డులు పెట్టారు.

బాధ్యతల స్వీకరణ


నాగప్రభుకుమార్, ఆవులయ్య

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా కె.వి.ప్రభుకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన్ను ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అభినందించారు. ★ ఏలూరు జిల్లా ఎక్సైజ్ అధికారిగా ఆవులయ్య బుధవారం తన ఛాంబరులో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాతున్న రత్నప్రసాద్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: మహిళలు పని చేసే కార్యాలయాల్లో వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ సూచించారు. స్థానిక న్యాయస్థాన ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగినులతో బుధవారం సమావేశమై మాట్లాడారు. కార్యాలయాల్లో సహచర ఉద్యోగుల కారణంగా ఎదురయ్యే సమస్యలు అధిగమించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరికైనా సమస్య ఏర్పడితే ధైర్యంగా కమిటీకి చెప్పాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని ఆయన భరోసానిచ్చారు. సమావేశంలో మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి మహ్మద్ అబూతాలీబ్ పర్వీజ్ షేక్, సీనియర్ న్యాయవాది కె కృష్ణారావు, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ. కోటి జీతం.. అయినా వద్దనుకున్నా!!
సమాజ ఉషస్సు! 6లో
పలు రైళ్లు పాక్షికంగా రద్దు, దారి మళ్లింపు

☛ తణుకు మండలం తేతలి సమీపంలోని ఓ చేపల చెరువులో గతంలో కోళ్ల వ్యర్థాలను ఉడకబెట్టి మేతగా వేసేవారు. సమీప రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో విరమించారు. అయితే స్థానిక మాంసం దుకాణాల నుంచి పెద్ద ఎత్తున మాంసం వ్యర్థాలను బయటకు తరలిస్తున్నారు.

మాంసం విక్రయ దుకాణాలు సుమారు 1650

☛ గతేడాది ఫిబ్రవరిలో కోడిమాంసం వ్యర్థాలు హైదరాబాద్ నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు తరలిస్తున్న నాలుగు వాహనాలను యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు.

కోళ్ల వ్యర్థం.. కనరే అనర్థం!

☛ చేపల చెరువుల్లో మేతగా వినియోగం ☛ దొంగచాటుగా తరలిస్తున్న దళారులు

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:


తణుకులో ఓ దుకాణం నుంచి డ్రమ్ముల్లో తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలు

ఉమ్మడి జిల్లాలో సుమారు 1650 వరకు మాంసం విక్రయ దుకాణాలున్నాయి. చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు తరలించేందుకు కొందరు దుకాణదారులతో ఒప్పందం చేసుకుని, రెండు మూడురోజులకోసారి వ్యాన్లలో వ్యర్థాలు తరలిస్తున్నారు. దీని కోసం ముందస్తు అడ్వాన్స్‌లు సైతం చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు మేతగా వేయడాన్ని నిషేధించింది. చెరువుల్లో కోడి వ్యర్థాలు ఉపయోగిస్తే ప్రజారోగ్యం దెబ్బతింటోందని వైద్య నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. అయినా కొంతమంది మానడం లేదు. పెదపాడు, ఏలూరు గ్రామీణ, పెదవేగి, భీమడోలు, కైకలూరు, ఉంగుటూరు, నిడమర్రు, భీమవరం, ఆకివీడు మండలాల్లో చాపకింద నీరులా ఈ వ్యాపారం సాగుతోంది.

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ.. చేపలకు మేతగా వేసే డీవోబీ (నూనె తీసిన తవుడు), వేరుశెనగ చెక్క ధర ఎక్కువ. ఆరు నెలలకు సగటున ఎకరాకు రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది. మాంసం వ్యర్థాలను మేతగా వేస్తే అది రూ.లక్షలోపే అవుతుంది. సంప్రదాయ చేపల మేత కిలో రూ.35 ధర ఉండగా, చికెన్ వ్యర్థాలు రూ.10కే దొరుకుతున్నాయి. ఒక ఎకరా చేపల చెరువుకు సంప్రదాయ మేత రోజుకు 20 కిలోలకు రూ.700 అవుతుంది. కూలి మరో రూ.200 అదనం. నెలకొచ్చేసరికి సుమారు రూ.25 వేలు అవుతుంది. అదే కోళ్ల వ్యర్థాలు 200 కిలోల డ్రమ్ము సుమారు రూ.2 వేలకే వచ్చేస్తుంది. నెలకు రూ.12 వేల నుంచి రూ.14 వేలే ఖర్చవుతుంది.

ఆదాయం కూడా.. సాధారణంగా మాంస వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించాలి. కానీ ఆ వ్యర్థాలను సైతం కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. దళారులు మాంసం దుకాణాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇది ఆదాయ మార్గంగా మారడంతో వారి మధ్య పోటీ ఎక్కువైంది. దుకాణ యజమానికి నెలకు రూ.6 వేల వరకు చెల్లిస్తున్నారు. వీటిని రూ.16వేల నుంచి రూ.20వేల వరకు విక్రయిస్తున్నారు. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ కావడంతో వ్యర్థాలు మాకే ఇవ్వాలంటూ ముందస్తుగా రూ.25 వేల వరకు అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంలో దళారుల మధ్య పోటీ నెలకొనడంతో సమస్య పరిష్కారానికి ఓ ప్రజాప్రతినిధిని ఆశ్రయించారని తెలిసింది. 'కొల్లేరు పరిసర ప్రాంతాల్లో రైతులకు సరఫరా చేసే అవకాశం ఉంది. తనిఖీ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని మత్స్యశాఖ జేడీ ప్రసాద్ తెలిపారు.

సగటు వర్షపాతం 41.2 మి.మీ.

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు 41.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఇరగవరం మండలంలో 133.4 మి.మీ వర్షం కురిసింది. పాలకొల్లు 75.2. పెనుగొండ 75.4, తాడేపల్లిగూడెం 70.2, పెనుమంట్ర 63.4, నరసాపురం 57.4 మి.మీ. చొప్పున వర్షం కురిసింది.

అధరగొట్టిన కట్లు!





ఆకివీడులో టోకు చేపల మార్కెట్‌కు బుధవారం భారీ చేపలు వచ్చాయి. తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన ఓ రైతు కట్ల జాతి చేపలను ఈ మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఒక్కోటి 8 నుంచి 14 కిలోల వరకు బరువుండటంతో ఓ వ్యాపారి మొత్తం చేపలను కిలో రూ. 270 చొప్పున కొనుగోలు చేసి పశ్చిమబెంగాల్‌కు ఎగుమతి చేశారు. ఈ జాతి చేపలు సాధారణంగా 2 నుంచి 3 కిలోల వరకు పెరుగుతాయి. ధర కిలో రూ. 130-150 వరకు పలుకుతుంది. 10 కిలోలకు పైగా బరువున్న చేపలు అరుదుగా వస్తుంటాయని.. అందుకే దాదాపు రెట్టింపు ధర దక్కిందని స్థానిక వ్యాపారులు చెప్పారు. - న్యూస్‌టుడే, ఆకివీడు

మహోన్నత నేత దీన్‌దయాళ్



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: సమాజంలో చిట్టచివరి వ్యక్తికీ స్వాతంత్య్ర ఫలాలు అందాలని, అందుకు నిరంతరం పరితపించిన మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు(ఉంగుటూరు), బొలిశెట్టి శ్రీనివాస్(తాడేపల్లిగూడెం), ఆరిమిల్లి రాధాకృష్ణ(తణుకు), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(అనపర్తి) కొనియాడారు. స్థానిక గ్రీన్ ఆసియా ఇంపెక్స్ పరిశ్రమలో భారతీయ జన్‌సంఘ్ సహ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు, దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో 110 మందికి వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, సర్పంచి బండారు సింధు, భాజపా శాసనసభ కన్వీనర్ శరణాల మాలతీరాణి, పరిశ్రమ అధినేత పసుపులేటి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెస్ నిర్వాహకులకు నోటీసులు



వంటలను పరిశీలిస్తున్న పరిపాలన అధికారి, విద్యార్థులు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్‌లో భోజనం నాణ్యత లోపించడంతో మెస్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి విద్యార్థులకు వడ్డించిన సాంబారు తయారీలో లోపం జరిగిందన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిత్యం పర్యవేక్షణ కోసం కళాశాల పరిపాలన అధికారి లక్ష్మణరావు, విద్యార్థుల భాగస్వామ్యంతో బృందం ఏర్పాటు చేశామన్నారు. రోజూ విద్యార్థులు మారుతూ భోజనం తయారీ, నిత్యావసర సరకుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ధ్రువీకరిస్తారన్నారు. వంట, నిత్యావసర వస్తువుల పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయి అధికారులకు, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పరిపాలన అధికారి లక్ష్మణరావు, సురేష్ పాల్గొన్నారు.

టీటీసీ పరీక్షల తేదీల్లో మార్పు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్(టీటీసీ) కోర్సులైన చిత్రలేఖనం, చేనేత, ఎంబ్రాయిడరీ, వీవింగ్ లోయర్ గ్రేడ్ పరీక్ష తేదీల్లో మార్పులు చేసినట్లు డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. ఆయా విభాగాల్లో అనుత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రస్తుతం పరీక్షలు జరగాల్సి ఉండగా... దాన్ని 27వ తేదీకి మార్చామని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో పరీక్షలుంటాయన్నారు. త్వరలోనే www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు పొందుపరుస్తారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విధుల నుంచి డీటీ తొలగింపు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మండల ఉప తహశీల్దారు ఎల్వీ సాగర్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై అవినీతి ఆరోపణలుండటం, ఉన్నతాధికారులను అసభ్య పదజాలంతో దూషించడం తదితరాల నేపథ్యంలో విచారణ చేపట్టారు. ఆ నివేదికను అనుసరించి విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ. కోటి జీతం... అయినా వద్దనుకున్నా!!

ముఖాముఖి

ఈనాడు, విశాఖపట్నం



జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి సవాళ్లను అధిగమించాలి. ఈ క్రమంలో 'రిస్క్' కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా సివిల్స్ సాధన చేసేవారికి ఒక రకమైన మొండి పట్టుదల ఉండాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చు. ఉన్నంతలో సర్దుకుపోదాం అంటే ఎప్పటికీ మన కలలను నిజం చేసుకోలేం' అని ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ చెబుతున్నారు.

రిస్క్ తీసుకొని సివిల్స్ వైపు వచ్చా

రోజుకు 14 గంటలు కష్టపడ్డా.. ఫలితంగానే 24వ ర్యాంకు

శ్రద్ధ చూపితే మొదటి ప్రయత్నంలోనే విజయం సాధ్యం

'ఈనాడు'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

ఈ యువ ఐఏఎస్ అధికారి సమయం చిక్కినప్పుడల్లా 'కెరీర్ గైడెన్స్' కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేలా 'హ్యాక్ ఏపీ హ్యాక్‌థాన్' కార్యక్రమాన్ని చేపట్టారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'అదర్ కెరీర్ ఆప్షన్స్' అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వచ్చాయి. మరిన్ని రాబోతున్నాయి. ప్రతి ఒక్కరూ కఠోర దీక్షగా శ్రమిస్తే ఆశించిన ఫలితం అందుకోవచ్చుంటున్న పృథ్వీతేజ్... తాను ఐఏఎస్ సాధించిన తీరు, స్వీయ అనుభవాలను 'ఈనాడు'తో పంచుకున్నారు.

విద్యార్థి దశ నుంచే బలమైన కోరిక: 'మాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ద్వారకా తిరుమల గ్రామం. మా నాన్న మొదట్లో కిరాణా దుకాణం నిర్వహించేవారు. తర్వాత చిన్న బంగారు ఆభరణాల దుకాణం నడుపుతున్నారు. నేను ఆరో తరగతి వరకు స్థానికంగానే చదువుకున్నా. ఏడో తరగతి నుంచి పదోతరగతి వరకు గుడివాడలో స్కూల్ హాస్టల్‌లో ఉండే చదువుకున్నా. అప్పుడే నాలో ఐఏఎస్ అవ్వాలనే కోరిక కలిగింది. 2011లో ఐఐటీ ప్రవేశ పరీక్ష రాసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించినప్పుడు ఆ కోరిక మరింత బలపడింది.

● ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. 2014 ప్రాంగణ ఎంపికల్లో సామ్‌సంగ్ కంపెనీలో ఉన్నత కొలువే దక్కింది. దక్షిణ కొరియాలో ఏడాదిపైగా ఉద్యోగం చేశాను. వార్షిక వేతనం రూ. కోటి పైనే. అయినా నాకు అది పెద్ద సంతృప్తినివ్వలేదు. సివిల్స్ పైనే మనసు ఉండిపోవడంతో ఇండియాకు వచ్చి తొలి ప్రయత్నంలోనే 24వ ర్యాంకు సాధించగలిగా. చిత్తూరులో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకున్నాక కడపలో సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత ట్రాన్స్‌కోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం ఈపీడీసీఎల్ సీఎండీగా పనిచేస్తూ సంస్థను అగ్రస్థానంలో నిలపడానికి కృషిచేస్తున్నా.

పెద్ద బహుమతే దక్కింది..



ఇంజినీరింగ్ తర్వాత రూ. కోటి వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాన్ని వదులుకుని సివిల్స్ వైపు రావాలనుకోవడం కొంచెం రిస్కే. అయినా నా లక్ష్యం ముందు అది చిన్నదిగానే అనిపించింది. అమ్మ, నాన్న కూడా నన్ను ప్రోత్సహించారు. 2016 చివర్లో దక్షిణ కొరియా నుంచి దిల్లీ వచ్చాను. అప్పటికే శిక్షణ సంస్థల్లో కోర్సులు చివరికి వచ్చేశాయి. దీంతో కేవలం మూడు నెలలు మాత్రమే క్రాష్ కోర్సు శిక్షణ తీసుకున్నాను. నాకు ఇష్టమైన గణితాన్నే ఐచ్ఛికంగా ఎంచుకుని సొంతంగా సాధన చేశా. పాత పేపర్లతో పాటు సీనియర్ల సూచనలు తీసుకుని రోజుకు 14 గంటలు పాటు చదివి తొలి ప్రయత్నంలోనే 24వ ర్యాంకు సాధించడంతో పడ్డ కష్టం, చేసిన రిస్క్‌కు పెద్ద బహుమతే దక్కింది.

ఏకాగ్రతతో చదవాలి..

జనరల్ కేటగిరీలో సివిల్స్ రాయడానికి ఆరు సార్లు అవకాశం ఉంటుంది. అన్ని అవకాశాలున్నాయి కదా.. ఏదో ఒక ఏడాది పోస్టు కొట్టొచ్చు అనేలా సాధన చేయకూడదు. ఒకటి, రెండు ప్రయత్నాల్లోనే కొలువు సాధించేలా ఏకాగ్రతతో చదువుతుండాలి. నోటిఫికేషన్ వచ్చినప్పుడు మూడు గంటలు చదువుదాం.. పరీక్ష దగ్గర పడుతున్నప్పుడు పది గంటలు చదివేద్దాం అంటే కుదరదు. మనం ఏ ఉద్యోగమైతే కొట్టాలనుకుంటున్నామో దానికి సంబంధించిన సబ్జెక్టులను తొలి రోజు నుంచే కనీసం 10 నుంచి 12 గంటలు సాధన చేస్తేనే విజయం సాధించడానికి అవకాశం ఉంటుంది. నేను ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు ఇదే చెబుతుంటా. కష్టే.. ఫలి అనే సూత్రాన్ని నమ్ముతుంటా. సివిల్స్ అనే కాదు...గ్రూప్స్, ఇతరత్రా ఏ పోటీ పరీక్షలకైనా ఇదే వర్తిస్తుంది.

సమాజ ఉషస్సు!

పేదలకు ఉచితంగా ఊలు వస్త్రాల పంపిణీ

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం

ఆమె సాధారణ గృహిణి... అలాగని వంటింటికే పరిమితం కాలేదు. భర్తకు వ్యాపారంలో చేదోడుగా నిలిచేవారు. సమాజానికి సేవ చేయాలని తపించేవారు. సామాజిక మాధ్యమంలో పరిచయమైన ఓ మహిళ స్ఫూర్తితో.. స్వచ్ఛంద సంస్థలో సభ్యురాలై.. పేదలకు తనవంతు సహాయ సహకారాలు అందించేవారు. వీరి సేవలకు ఇటీవల గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది.

- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్



ధ్రువపత్రం, జ్ఞాపిక అందుకుంటూ...



ఇంటి వద్ద ఊలుతో స్వెటర్ అల్లుతున్న ఉషా శారద

ఏలూరు నగరానికి చెందిన సరివి ఉషా శారద ఎగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన మహిళ. భర్త అశోక్ కుమార్ ఓ దుకాణం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో భర్తకు చేదోడుగా నిలుస్తూ... తీరిక సమయంలో వివిధ రకాల అల్లికలు చేస్తుంటారు. ఇద్దరు ఆడ పిల్లలు, భర్తతో సంతోషంగా గడుపుతున్న ఆమె.. సమాజానికి తనవంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సామాజిక మాధ్యమంలో విశాఖపట్నానికి చెందిన సూరిభట్ల మాధవి పరిచయమయ్యారు. ఆమె మహిళా మనో వికాస్ పేరిట నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలో సభ్యురాలిగా చేరారు. దేశవిదేశాలకు చెందిన మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఊలుతో వస్త్రాలు తయారు చేసి, వాటిని పేదలకు ఉచితంగా అందజేస్తున్నారు. ఏడాది వ్యవధిలో 450 మంది సభ్యులు 58,115 ఊలు వస్త్రాలను పేదలు, అనాథ బాలలకు పంపిణీ చేశారు. ఇందుకు గాను సంస్థలోని సభ్యులందరికీ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈ నెల 22న విశాఖపట్నంలో మహిళల బృందం పురస్కారం అందుకుంది. 'సమాజానికి కొంత సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తోంది. మా సేవలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉంది.' అని ఉషా శారద తెలిపారు.

పలు రైళ్లు పాక్షికంగా రద్దు, దారి మళ్లింపు

విజయవాడ, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల దృష్ట్యా పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు దారి మళ్లిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ★ పాక్షికంగా రద్దయిన రైళ్లు 07863 నర్సాపూర్-విజయవాడ, 07283 విజయవాడ-భీమవరం జంక్షన్, 07861 విజయవాడ-నర్సాపూర్ ★ దారి మళ్లించిన రైళ్లు (వయా విజయవాడ, గుడివాడ, నిడదవోలు మీదుగా), 22643 ఎర్నాకుళం, పాట్నా (ఈ నెల 30, అక్టోబరు 7, 14, 21 తేదీల్లో), 12756 భావనగర్-కాకినాడ పోర్ట్ (అక్టోబరు 6, 12, 19, 26 తేదీల్లో), 12509 బెంగళూరు-భువనేశ్వర్ (అక్టోబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25), 11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ (ఈనెల 30, అక్టోబరు 2, 4, 5, 7, 9, 11, 12, 14, 16, 18, 19, 21, 23, 25, 26), 13351 ధన్‌బాద్-అలప్పుజ (ఈ నెల 30 నుంచి అక్టోబరు 27వరకు), 18111 టాటా-యశ్వంత్‌పూర్ (అక్టోబరు 3, 10, 17, 24 తేదీల్లో).

ఈపీఎఫ్‌వో 'నిధి ఆప్‌కే నికత్' రేపు

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికత్' శిబిరాలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.డి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి కాళ్లకూరు పీఏసీఎస్ ఆవరణలో శిబిరాలు జరుగుతాయన్నా.

కూలీలకు వంద రోజుల పని దినాలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో ప్రతి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించే బాధ్యత క్షేత్ర సహాయకులు, ఏపీవోదేనని డ్వామా పీడీ ఎ.రాము స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీడీవో రాజ్‌మనోజ్ అధ్యక్షత వహించారు. పీడీ మాట్లాడుతూ... గత ఆర్థిక సంవత్సరంలో 1,953 పనులు చేపట్టగా- మొత్తం రూ. 17.25 కోట్లు వెచ్చించారన్నారు. అందులో కూలీలకు రూ. 12.05 కోట్లు వేతనాలు ఇవ్వగా- సామగ్రికి రూ. 5.19 కోట్లు వెచ్చించారని చెప్పారు.

బీసీ వసతి గృహం తనిఖీ



తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సౌకర్యాలు, ఆహార నాణ్యత, తదితర విషయాలపై ఆరా తీశారు. ప్రస్తుత భవనం ఇరుగ్గా ఉందని.. మరో భవనం అద్దెకు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలన్నారు. ఇకపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణ రెడ్డి, తహసీల్దార్ సునీల్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల పురోగతికి కృషి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సహకార సంఘాల పురోగతికి పర్సన్ ఇన్‌ఛార్జులు కృషి చేయాలని డీసీసీబీ ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్, సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సూచించారు. స్థానిక డీసీసీబీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభ నిర్వహించారు. తొలుత 2023-24 ఆడిట్ నివేదికను ఆమోదించారు. ఆపై బ్యాంకు ఆర్థిక పరిస్థితులపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ... సీఆర్ఏఆర్ శాతాన్ని పెంచడానికి, షేర్ క్యాపిటల్‌ను బ్యాంకులో మదుపు చేయాలన్నారు. అక్టోబరు 7 నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డీసీవో ఎ.శ్రీనివాస్, బ్యాంకు సీఈవో నారా తిలక్, భీమవరం డీఆర్ కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి దుర్మరణం



వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతిచెందిన ఘటన అశ్వారావుపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలేనికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్వరరావు(22) ట్రాక్టర్ డ్రైవర్. అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం నుంచి పామాయిల్ గెలలను ట్రాక్టరులో అశ్వారావుపేట ఫ్యాక్టరీకి బుధవారం తరలిస్తున్నాడు. మార్గం మధ్యలో సత్తెమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. వెంకటేశ్వరరావు మీదుగా ట్రక్కు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు చెప్పారు.

సీబీఐ అధికారంటూ బెదిరింపులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.9 లక్షల కాజేత

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: మేము సీబీఐ అధికారి. ముంబయి నుంచి మాట్లాడుతున్నామని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఫోనులో బెదిరించిన అగంతకులు... అతడి నుంచి రూ.9 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం మేరకు... స్థానిక శ్రీరామ్‌నగర్ ఆరో రోడ్డుకు చెందిన మహ్మద్ రాహిల్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ నెల 23న అపరిచిత వ్యక్తి ఫోను చేశాడు. ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఫోన్ నంబరు నుంచి చట్టవ్యతిరేక కార్యక్రమాల సంభాషణలున్నాయని బెదిరించాడు. ఆ తర్వాత మరొకరు వీడియో కాల్ చేసి.. తాము ముంబయి సీబీఐ అధికారని, మీ వివరాలన్నీ తమ వద్ద ఉన్నాయని బెదిరించి ఆధార్ కార్డు చూపాడు. దాంతో ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంబేలెత్తిపోయారు. మీపై కేసు లేకుండా ఉంటాలంటే రూ.9 లక్షలు కట్టాలని చెప్పడంతో... అతను వెంటనే వారి ఖాతాలో నగదు జమ చేశారు. ఆ తర్వాత మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదుతో మూడో పట్టణ సీఐ కోటేశ్వరరావు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా...

కొనసాగిన జిల్లా జట్ల ఎంపికలు

ఏలూరు తూర్పు వీధి, న్యూస్‌టుడే: స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్- 14, 17 బాలబాలికల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి పోటీలు బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగాయి. స్థానిక కోటదిబ్బ కస్తూర్బా నగరపాలక బాలికోన్నత పాఠశాల మైదానంలో బాస్కెట్ బాల్(బాలికలు), ఏఎస్ఆర్ స్టేడియం బిశ్వనాథ భర్తియా కొలనులో ఈత(బాలబాలికలు), కలెక్టరేట్ సమీప ఇండోర్ మైదానంలో రెజ్లింగ్(బాలబాలికల) పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 320 క్రీడాకారులు హాజరయ్యారు. బాస్కెట్‌బాల్(బాలికలు) 24 మంది, ఈత(బాలబాలికలు) 46 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.



బాస్కెట్ బాల్ జట్టు క్రీడాకారిణులు

నెట్‌బాల్‌లో.. పాలకోడేరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలను పాలకోడేరు మండలం గొరగనమూడిలోని స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఎంఈవో శ్రీమన్నారాయణ, ప్రజాప్రతినిధులు పోటీలను ప్రారంభించారు. ఇరు జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు.



పాలకోడేరు: పోటీలో తలపడుతున్న బాలికలు

వరద బాధితులకు విరాళం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం భీమవరానికి చెందిన మాచర్ల శివ భాస్కరరావు, సునీతల కుమార్తె సాయి షిర్డి (ఎయిమ్స్ ఎండీ) రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు బుధవారం అందజేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న సాయిషిర్డి

చోరీ కేసులో ఇద్దరికి జైలు

కైకలూరు, న్యూస్‌టుడే: చోరీ చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ కైకలూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ బుధవారం తీర్పును వెలువరించినట్లు పట్టణ సీఐ పి.కృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 నవంబరులో ఏలూరు జిల్లా కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లోని ఓ తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి బంగారం, నగదు అపహరించారు. దీనిపై కేసు నమోదు చేసిన అప్పటి సీఐ ఏలూరుకు చెందిన అత్తోటి జాన్‌పాల్, గౌతు శేషు, తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన కొఠారు వాసులను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరు పరిచి ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై పోలీసులు బుధవారం సాక్ష్యులను ప్రవేశపెట్టి న్యాయవాది ద్వారా వాదనలు వినిపించారు. ఏలూరుకు చెందిన అత్తోటి జాన్‌పాల్, గౌతు శేషు వద్ద చోరీ చేసిన సొత్తు ఉందని నేరం రుజువైంది. ఈక్రమంలో న్యాయమూర్తి జాన్‌పాల్‌కు 97 రోజులు, గౌతు శేషుకు 142 రోజులు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. మరో వ్యక్తి కొఠారు వాసుపై ఎటువంటి నేరం రుజువు కానందున నిర్దోషిగా ప్రకటిస్తూ విడుదల చేశారు.

అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు

400 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 44 కేసుల్లో నిందితుడు.. 14 కేసుల్లో జైలుకు వెళ్లాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జైలు నుంచి విడుదలయ్యాడు. గత నెలలో భారీ చోరీచేసి తిరిగి పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర నేరస్థుడ్ని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా జగన్నాథపురం ఏటిమొగకి చెందిన పొన్నాడ రవిశంకర్ అలియాస్ వీరబాబు రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డులోని కోటభాస్కరమ్మనగర్‌లో నివాసముంటున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 22, విశాఖ పరిధిలో 16, తూర్పుగోదావరిలో 2, శ్రీకాకుళంలో 2, విజయనగరంలో ఒకటి, అనకాపల్లిలో ఒకటి మొత్తం 44 చోరీ కేసుల్లో నేరస్తుడు. గతనెల 26 రాత్రి కొవ్వూరు పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో మహమ్మద్ మహారాజ్ అపార్టుమెంట్‌లోని కట్టా ఉషశ్రీ ఫ్లాటులోకి చొరబడి సుమారు 400 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం చోరీ చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, ఎస్సైలు పి.రవీంద్రబాబు, కె.జగన్మోహనరావు రెండు బృందాలుగా కేసు దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ఇటీవల కొవ్వూరు పట్టణంలోని నిడదవోలు బస్టాపులో నిందితుడు వీరబాబు, అతడికి సహకరించిన లంకలపల్లి నాగరాజును అరెస్టు చేశారు. చోరీ సొత్తును భీమవరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రికవరీ చేశారు. వీరబాబు చోరీచేసిన రూ. 15.30 లక్షల విలువజేసే 400 గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు ద్విచక్రవాహనాన్ని రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. రెండో నిందితుడైన నాగరాజు భీమవరం పట్టణంలోని పాలూరివారి వీధిలో నివాసముంటూ భీమవరం స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్, పాలకోడేరు స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసుల్లో జైలుశిక్ష అనుభవించి గత ఏప్రిల్ నెలలో విడుదలయ్యాడన్నారు. కేసుల్లో ప్రతిభ చూపిన పలువురు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

చింతలపూడి, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసమైన ఘటన చింతలపూడి మండలం రాఘవాపురంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆ గ్రామానికి చెందిన సీహెచ్ నాగరాజు కుటుంబం కొద్ది రోజులుగా వేరే ఊర్లోని బంధువుల ఇంట్లో ఉంటోంది. బుధవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ పేలి భారీ శబ్దం వచ్చింది. స్థానికులు వెంటనే నాగరాజుకు ఫోన్ చేసి చెప్పడంతో హుటాహుటిన ఇంటికి చేరుకున్నాడు. ప్రమాదంలో శ్లాబు పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు గృహోపకరణాలు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఎవరూ లేని సమయంలో ప్రమాదం జరగడంతో ప్రాణ నష్టం తప్పింది.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 లేయర్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డ ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.50 పైతణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

●భీమవరం ●ఉండి

పవిత్రోత్సవాలకు శ్రీకారం


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీక్షాధారణ, అంకురార్పణ, తీర్థగోష్ఠి తదితర పూజలు ప్రధానార్చకుడు కాండూరి వెంకటరమణాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈవో ఎం. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు విశేష పూజలు, హోమాలు జరుగుతాయన్నారు. ముగింపు రోజున శోభాయాత్ర, సప్తనదీ జలాభిషేకం, శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయమూర్తి సోమశేఖర్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు భీమవరం న్యాయస్థానాల సముదాయ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ మాట్లాడుతూ పనిచేస్తున్న ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, వేధింపులను అరికట్టే చట్టాలు, నిబంధనలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

గునుపూడి, న్యూస్‌టుడే

సమస్య : భీమవరం 14వ వార్డు పరిధి భీమనాథం తూము కూడలి నుంచి రామాయణం సుబ్బన్న తోటకు వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభాలు, పరివర్తకాలకు పాదులు అల్లుకుపోయాయి. చినపాటి వర్షం కురిసినా విద్యుత్తు సరఫరా నిలిచిపోతోంది.
- స్థానిక నివాసితులు

సమాధానం: స్తంభాలపై పాదుల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాస్, విద్యుత్తు ఏఈ

కాళ్ల, న్యూస్‌టుడే

సమస్య: కోపల్లె గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న పశువైద్యశాల భవనం ఆవరణ చిట్టవిలా మారింది. వైద్యం చేసే రేకుల షెడ్డు శిథిల స్థితికి చేరింది.
- స్థానిక రైతులు

సమాధానం : సమస్యను ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో మరమ్మతులు చేయిస్తాం.
- జీవీ సూర్యనారాయణ, పశువైద్యుడు


క్షీరాభిషేకం చేస్తున్న స్థానికులు, పాల్గొన్న నాయకులు

కానరాని స్వచ్ఛత!

పల్లెల్లో గాడిన పడని పారిశుద్ధ్య నిర్వహణ

భీమవరం గ్రామీణ, కాళ్ల, న్యూస్‌టుడే

పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఇటీవల నిర్వహించిన సమీక్షల్లో కలెక్టర్ నాగరాణి ఆదేశాలిచ్చారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 1 వరకు అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నా పల్లెల్లో పారిశుద్ధ్యం మాత్రం మెరుగుపడలేదు. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఆదేశించినా పట్టించుకునే వారే లేరు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో కాలువ గట్లు, రహదారుల అంచులు చెత్త కుప్పలకు నిలయాలుగా మారాయి.

భీమవరం మండలం నాగిడిపాలెం పంచాయతీలో గతంలో రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఇది. కనీస నిర్వహణ లేక క్రమంగా శిథిలస్థితికి చేరింది. లోపలి భాగంలో గోడలు, తొట్టెలు పగుళ్లు తీశాయి. పైభాగంలో షెడ్డు కొంత మేర దెబ్బతింది.



నిర్లక్ష్యం వహిస్తే చర్యలు..

అన్నిచోట్లా పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శులకు స్పష్టంగా చెప్పాం. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తేవాల్సిందే. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కచ్చితంగా చర్యలుంటాయి.
- నామేశ్వరరావు, పంచాయతీ విస్తరణాధికారి, భీమవరం

ఇదీ పరిస్థితి

భీమవరం మండలంలో 25 పంచాయతీలు ఉండగా గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు 22 చోట్ల ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు నిర్మించారు. వీటిలో ప్రస్తుతం ఒక్కటి కూడా వినియోగంలో లేదు. జిల్లా అధికారులు ఆదేశించినప్పుడు మాత్రం కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకొంటున్నారు. వీరవాసరం మండలంలో 23 పంచాయతీలకు గాను 16 చోట్ల వీటిని నిర్మించగా చాలా వరకు నిరుపయోగంగానే మిగిలాయి. కాళ్ల మండలంలో పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. అప్పట్లో ఒక్కో కేంద్రానికి రూ.5లక్షల నుంచి 12లక్షల వరకు ఖర్చు చేశారు.

కాళ్ల మండలం వేంపాడు గ్రామంలో కోపల్లె పంట కాలువ సమీపాన ఉన్న సంపద కేంద్రం ఎదుట ఇలా చెత్త గుట్టలు పేరుకుపోయాయి. ఏళ్ల తరబడి ఈ కేంద్రాన్ని వినియోగించకపోవడంతో అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గ్రామంలో సేకరించే వ్యర్థాలను రహదారులు, కాలువ గట్ల వెంబడి పోస్తున్నారు.



ఐటీఐ విద్యార్థుల శ్రమదానం

ఉండి, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఉండి ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు బుధవారం శ్రమదానం చేశారు. తొలుత తమ కళాశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలోని విత్తన చేలో కలుపు మొక్కలు తీసినట్లు ఐటీఐ ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన సదస్సును భీమవరం పురపాలక కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉందన్నారు. వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు.

సేవలు అభినందనీయం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: యూత్ హాస్టల్స్ భీమవరం శాఖ సేవలు అభినందనీయమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆ సంస్థ ప్రతినిధులు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

వరద బాధితులకు భరోసా

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో కొల్లేరు వరద ప్రభావంతో ఇళ్లు ముంపు బారినపడి నష్టపోయిన 236 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం జమచేసింది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ఆయా వార్డుల పరిధిలో వరద బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. గొంట్ల గణపతి, గంధం ఉమా, పిల్లా నరసింహారావు (బాబులు), గవర లక్ష్మి, కె.జానకి సుమంత్ తదితర తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం విద్యుత్తు వినియోగ లెక్కింపు సిబ్బంది పని దినాలు తగ్గించి కష్టపెట్టిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆ సంఘం సభ్యులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు బుధవారం వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేమవరం శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్, జాకబ్, ఆదినారాయణ, పోదూరి శ్రీను, ప్రసాద్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై 28న గ్రామ సభలు


గోడపత్రం ఆవిష్కరిస్తున్న అధికారులు

ఉండి, న్యూస్‌టుడే: పేదల ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోపు పూర్తిచేసేలా కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి విక్టర్ సూచించారు. ఉండి మండల పరిషత్తు కార్యాలయంలో గృహనిర్మాణ లేఅవుట్ల ప్రత్యేకాధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా ఇల్లు.. మన గౌరవం' పేరిట ఈ నెల 28న అన్ని గ్రామాల్లో ఒకేసారి సభలు నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేశారన్నారు. మండల పరిధిలో వివిధ స్థాయిల్లో నిలిచిన ఇళ్లను పూర్తిచేసేలా, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. మార్చి 31 తర్వాత ఆర్థిక సహకారం అందదనే అంశాన్ని వారికి గుర్తుచేయాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించారు. ఎంపీడీవో ఎస్.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం మండల ప్రత్యేకాధికారి సుజాతరాణి అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఈఈ పి. శివరామరాజు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం


మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి

మత్స్యపురి (వీరవాసరం), న్యూస్‌టుడే: వీరవాసరం మండలం మత్స్యపురిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం ప్రారంభించిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం వంటి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేశారన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మత్స్యపురిలో కర్రలు పట్టుకుని ఇళ్లపై దాడులు చేసి అమాయకులపై అక్రమ కేసులో మోపారన్నారు. త్వరలోనే ఆ కేసులన్నీ ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గంలో ప్రధాన డ్రెయిన్ల ఆధునికీకరణ చర్యలు తీసుకుంటామన్నారు. బదిలీ ప్రక్రియ పూర్తయ్యాక అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, సర్పంచి కారేపల్లి శాంతిప్రియ, ఇతర సర్పంచి జవ్వాది ఉదయ భాస్కరరావు, తెదేపా గ్రామ అధ్యక్షుడు చింతా కనకయ్య, జనసేన, తెదేపా మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ, కోళ్లేపర శ్రీనివాసరావు, తెదేపా రాష్ట్ర పార్టీ నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, మెంటే పార్థసారధి, మాజీ సర్పంచి పిప్పళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమవరంలో.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని భీమవరం పరిధి గునుపూడిలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కార్యాలయ సిబ్బంది తెలిపారు.


మోగల్లు: కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

100 రోజుల్లోనే సుపరిపాలన

పాలకోడేరు, న్యూస్‌టుడే: కేవలం 100 రోజుల్లోనే సుపరిపాలన అందించిన కూటమి ప్రభుత్వం అందరి మన్ననలు పొందిందని నాయకులు పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని తెదేపా, జనసేన మోగల్లు గ్రామ అధ్యక్షులు సంజీవ సుందరరాజు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం మోగల్లు గ్రామంలో నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన పింఛన్ల పెంపు, ఉచిత ఇసుక, మద్యం పాలసీ మార్పు వంటి అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. తెదేపా నాయకులు కొత్తపల్లి బాబు, మల్లిపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రజలు, రైతుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా, జనసేన, భాజపా నాయకులు అన్నారు. అయిభీమవరం, కాళింగగూడెం, సిద్ధాపురం, పెదకాపవరం, చినకాపవరం తదితర గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

ఆలయ నిర్మాణంపై విచారణ

గూట్లపాడు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం గూట్లపాడు పంచాయతీలో మంచి నీటి చెరువు గట్టున అనుమతి లేకుండా ఆలయం నిర్మిస్తున్నారంటూ కొందరు గ్రామస్థులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ విచారణ చేపట్టారు. ఆయనతో పాటు ఇతర అధికారులు బుధవారం గ్రామానికి వచ్చి స్థానికులతో సమావేశం నిర్వహించారు. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల మధ్య మరోసారి వాగ్వాదం చోటు చేసుకుంది. నచ్చజెప్పినా ఫలితం లేకపోవడంతో అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. జిల్లా అధికారులు, తహసీల్దారు, పోలీసుల సమక్షంలోనే తమపై దౌర్జన్యానికి దిగారంటూ ఒక వర్గం ఆరోపించింది.

27న ఆక్వా ఎక్స్‌పో

ఉండి, న్యూస్‌టుడే: ఉండి- భీమవరం రహదారిలో ఉన్న కోట్ల ఫంక్షన్ హాలులో ఈ నెల 27న అంతర్జాతీయ స్థాయి ఆక్వాకల్చర్ ఎక్స్‌పో ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్వా రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	మత్తువదలరా 2
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సరిపోదా శనివారం
నటరాజ్	100 క్రోర్స్
కిషోర్ స్క్రీన్ 1	జర్నీ, బొమ్మరిల్లు
కిషోర్ స్క్రీన్ 2	చిక్లెట్స్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	మన్యం ధీరుడు
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	మత్తువదలరా 2
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	సరిపోదా శనివారం
విజయలక్ష్మి స్క్రీన్ 1	గొర్రె పురాణం
మహాలక్ష్మి స్క్రీన్ 2	కళింగ

గుణపాఠం నేర్వని వైకాపా


పాదయాత్రలో కూటమి నాయకులు

కాళ్ల, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను గమనించిన ప్రజలు ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని.. ఇంత జరిగినా ఆ పార్టీ నాయకులు గుణపాఠం నేర్వకుండా అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని కూటమి పార్టీల నాయకులు విమర్శించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ ఘటనను నిరసిస్తూ ఎన్డీయే నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు కాళ్ల గ్రామం నుంచి కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు బుధవారం పాదయాత్ర చేశారు. అనంతరం వేంకన్న ఆలయం మెట్లను పసుపు నీళ్లతో కడిగి శుద్ధి చేశారు.

వేంకన్న ఆలయంలో ప్రాయశ్చిత్త దీక్ష

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడం మనందరి కర్తవ్యమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. జువ్వలపాలెం రోడ్డులో ఉన్న పద్మావతీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రాయశ్చిత్త దీక్షలో ఆయన మాట్లాడారు. తొలుత స్వామికి క్షీరాభిషేకం చేశారు. తిరుమల లడ్డూ తయారీలో నెయ్యి కల్తీ హిందువుల మనోభావాలను కలిచి వేసిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా 4 రోజుల పాటు పార్టీ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

ఆర్‌ఎస్ మృతి తీరనిలోటు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్ వంటి నాయకులను కోల్పోవడం సీపీఎంకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. నరసాపురం మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణరాజు సంస్మరణ సభను భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి. బలరాం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో సమస్యలపై పోరాటం చేయడమే ఆర్‌ఎస్‌కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. తెదేపా రాష్ట్ర నాయకుడు మెంటే పార్థసారథి, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ గౌరవించే ఏకైక నాయకుడు ఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణంరాజు, పార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి చర్యలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాల కట్టడికి చర్యలు చేపట్టినట్లు భీమవరం గ్రామీణ సీఐ బి.శ్రీనివాస్ తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పాలకోడేరు పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. పెండింగ్ కేసులు, అరెస్టులపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఎస్సై ఎన్.హరిబాబు, ఏఎస్సై మోహనరావు సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి సంబరాలు

అనాకోడేరు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం అనాకోడేరు ఉన్నత పాఠశాలలో చెకుముకి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏటా చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, సృజనాత్మకతను వెలికి తీస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలంలో పలు ప్రభుత్వ, ప్రవేటు ఉన్నత పాఠశాల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించినట్లు మండల కన్వీనర్ బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి తెలిపారు. విజేతలు అక్టోబరు 1న నిర్వహించే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

దీన్‌దయాళ్ ఆశయ సాధనకు కృషి


భీమవరం: చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసవర్మ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జన్‌సంఘ్ నేత పండిత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. దీన్‌దయాళ్ జయంతి కార్యక్రమాన్ని భీమవరంలోని భాజపా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పేరిచర్ల సుభాష్, కాయిత సురేంద్ర, అల్లూరి సాయిదుర్గరాజు, కోమటి రవికుమార్, అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, లంక లక్ష్మి, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: మత్స్యపురి గ్రామంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువమోర్చా నాయకులు ఆకుల లీలాకృష్ణమూర్తి, దగ్గు రమణకుమారి, హరిబాబు, వేండ్ర దివాకర్, మద్దాల శివాజీ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని సహాయ ఉద్యోగి మృతి

కాళ్ల(భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: భీమవరం పరిధి ఉండి రోడ్డులోని మార్కెట్ యార్డు తనిఖీ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న సహాయ ఉద్యోగి సాలా వెంకటేశ్వరరావు (48)ను లారీ ఢీకొట్టడంతో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 24న ఆయన విధుల్లో ఉండగా లారీ చోదకుడు నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎన్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ చెక్‌పోస్టు సిబ్బంది భీమవరం ప్రభుత్వాసుపత్రి శవాగారం వద్ద బుధవారం ఆందోళనకు దిగారు.

కాలువలో దూకి గల్లంతు?

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పరిధిలో గొల్లవానితిప్పరోడ్డులో వంతెన పైనుంచి ఓ వ్యక్తి కాలువలో దూకి గల్లంతైనట్లు తెలిసింది. దీనిపై అందిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అతడి కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాల మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హామీలు నెరవేర్చాలంటూ ధర్నా

భీమవరం టూటౌన్, న్యూస్‌టుడే: ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు డిమాండ్ చేశారు. థాలీ బజావో కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ నాయకులు బుధవారం ధర్నా చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో కైలాస నిలయం సేవాసంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుమ్ములూరు కూడలి సమీపాన యాచకులకు, పేదలకు భోజనం పొట్లాలు, పండ్లు, దుప్పట్లు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ఆకివీడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమతానగర్ ప్రాంతంలో వరద బాధితులకు దుప్పట్లు, చీరలు, విద్యార్థులు పుస్తకాలు అందజేశారు.

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

క్రమశిక్షణ అలవర్చుకోవాలి : డీఎస్పీ

నరసాపురం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని సూర్య కళాశాలలో విద్యార్థులకు చట్టాలు, అమలు తదితర అంశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ అందజేస్తున్న సేవల్లో సమస్యలు, అభిప్రాయాలు సేకరణకు గురువారం ఉదయం 11-12 గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నామని డీఎం మేనేజరు సత్తి సుబ్బన్నరెడ్డి తెలిపారు. 99592 25486 నంబరుకు ఫోన్ చేసి, సమస్యలు, అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు.

నరసాపురంలో 'స్వచ్ఛ భారత్'



నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో పురపాలక సంఘ పాలక వర్గ సభ్యులు బుధవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా శివాలయం కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రహదారులను శుభ్రం చేశారు. ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, కమిషనర్ అంజయ్య, వార్డు కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రహదారి శుభ్రం చేస్తున్న ఛైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

స్పందనకు వందనం

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ కంబాలవారి వీధిలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని ఈ నెల 18న మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగించారు.

నిధుల్లేక తడబడి...!



మార్టేరులోని జడ్పీ హైస్కూల్

పోడూరు, మార్టేరు, న్యూస్‌టుడే

ప్రభుత్వ బడుల్లో నిర్వహణకు నిధుల్లేక ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. సుద్దముక్కలు కొనడానికి, రిజిస్టర్ల కొనుగోలుకు, విద్యుత్తు ఛార్జీలు చెల్లించడానికి, ఇతర నిర్వహణ పనులకు చేతిలో చిల్లిగవ్వ లేక ఆపసోపాలు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం రెండేళ్లుగా నిధుల మంజూరులో నిర్లక్ష్యం చూపింది. నిత్యం అవసరమయ్యే సుద్దముక్కల కొనుగోలుకు కొన్ని చోట్ల విద్యార్థుల నుంచి సొమ్ములు వసూలు చేసి నెట్టుకొస్తున్నారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులే పెట్టుబడులు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొన్ని సందర్భంలో పాఠశాలల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

✦ ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో 422 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 30వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2021-22లో అరకొరగా మంజూరు చేసినా 2022-23, 2023-24లో ఆ ఊసే లేకుండా పోయింది. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు ఒక్కో పాఠశాలలకు ఏటా నిర్వహణ నిధులు మంజూరు చేయాల్సి ఉంది. ముఖ్యంగా నాడు-నేడు పథకంలో పనులు చేపట్టిన బడుల్లో నిర్వహణ భారం గణనీయంగా పెరిగింది. మరుగుదొడ్ల నిర్వహణకు తప్ప ఇతరత్రా ఎటువంటి నిధులు రావడం లేదు. నిధులకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపించామని నిధులు విడుదల కాగానే ఆయా బ్యాంకు ఖాతాల్లోకి జమవుతాయని డీవై ఈవో సత్యనారాయణ తెలిపారు.

సమస్యల పరిష్కారం దిశగా ఎన్డీయే సర్కారు

విద్యా వ్యవస్థ గాడిలో పెట్టేందుకు ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కలెక్టర్లతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేశ్ పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. అత్యవసర నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు.

ఏకాంబరేశ్వరస్వామికి అన్నాభిషేకం



పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక కామాక్షి ఆలయంలో బుధవారం ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకుడు కొండవీటి సూర్యనారాయణమూర్తి ఏకాంబరేశ్వరస్వామికి అన్నాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెనుగొండలో అత్యధిక వర్షపాతం

మార్టేరు, న్యూస్‌టుడే: ఆచంట నియోజకవర్గంలోని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పెనుగొండలో 75.4, పెనుమంట్రలో 63.4, ఆచంటలో 44.2 పోడూరులో 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షప్రభావం లేకపోవడంతో జన జీవనానికి ఇబ్బంది కలగలేదు. మార్టేరు శివారు ఆచంట వెళ్లే రోడ్డులోని గుంతలో వర్షపు నీరు చేరి పలువురు వాహన చోదకులు అదుపుతప్పి పడిపోయారు.

భాజపా సభ్యత్వ నమోదు



నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు నియోజకవర్గంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని భాజపా నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీశ్ కుమార్ అన్నారు. మల్లవరంలో బుధవారం భాజపా నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు మూడు వేల సభ్యత్వాల నమోదు చేశామన్నారు. జిల్లాలోనే నరసాపురం నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందన్నారు. భాజపా మండల అధ్యక్షుడు నడిపూడి పెద్దిరాజు, నాయకులు బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమంపై దృష్టి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించారని కూటమి నాయకులు ఉన్నారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం' బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడారు. ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల కబర్థి, కోడి విజయభాస్కర్, నీలం తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

రథాల పర్యవేక్షణకు చర్యలు



సూచనలు చేస్తున్న సీఐ రజనీకుమార్

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో రథశాల, వాహనశాలను పట్టణ సీఐ కె. రజనీకుమార్ బుధవారం పరిశీలించారు. వాటి భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. రథశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. వాటి రక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తాం : పితాని



విద్యార్థులతో ఎమ్మెల్యే సత్యనారాయణ

మార్టేరు, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తామని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మార్టేరు పంచగ్రామాల పరిధిలోని శివరావుపేట, నెగ్గిపూడి ఎస్సీ ఏరియా, వనంపల్లి ప్రాంతాల్లో సుమారు రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పేరుతో గత వైకాపా ప్రభుత్వం దోపిడీకి తెర లేపి అడ్డగోలు నిర్మాణాలు చేపట్టిందన్నారు. నాలుగేళ్ల నాడు ప్రారంభించిన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. సర్పంచులు కుమారి, ధనలక్ష్మి, నాయకులు మల్లికార్జునరెడ్డి, బాలాజీవనకుమార్, శ్రీనివాసరెడ్డి, అచ్యుతరామిరెడ్డి, బాలాజీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: వైకాపా నుంచి ఇతర పార్టీలోకి పెద్ద సంఖ్యలో వలసలు మొదలయ్యాయని, త్వరలోనే ఆ పార్టీ పూర్తిగా కనుమరగవడం ఖాయమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పోలమూరు, మాముడూరు గ్రామాల్లో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తీరు చూసి ఆ పార్టీవారే విసుగుపోయారన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సర్పంచులు కాకర రాజేశ్వరరావు, గూడూరి దేవేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

పెనుగొండ, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితులకు వడలి గ్రామస్థులు సేకరించిన రూ.42 వేల చెక్కును బుధవారం మార్టేరులో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు అందించారు. దీనిని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపాలని కోరారు. పితాని మాట్లాడుతూ వరదలతో సర్వం కోల్పోయిన వారికి ప్రతి ఒక్కరు అండగా నిలుస్తుండటం అభినందనీయమన్నారు.

విజయవంతంగా ఎన్డీయే పాలన : బొమ్మిడి



మాట్లాడుతున్న నాయకర్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్డీయే పాలన విజయవంతంగా సాగుతోందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. కొత్త నవరసపురంలో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, చంద్రశేఖర్, వాతాడి ఉమామహేశ్వరరావు, సర్పంచి జగ్జీవన్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఈదా జోన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి దిశగా.. పెనుగొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్డీయే ప్రగతి దిశగా సాగుతుందని తెదేపా మండల అధ్యక్షుడు వెలిచేటి బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం వడలి పంచాయతీ కార్యాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం, స్వర్ణాంధ్ర 2047 గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. వడలి సర్పంచి కాసాని విజయలక్ష్మి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర అభివృద్ధికి యువకులు, ప్రజలు సూచనలు, సలహాలను క్యూఆర్ కోడ్ ద్వారా అందించాలని కోరారు.

మూడు నుంచి దసరా ఉత్సవాలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలోని శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి పంచాయతన క్షేత్రంలో ఈ నెల 3 నుంచి 13 వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవరాత్రుల్లో విశేష అలంకరణలు, ప్రతీరోజు సంపూర్ణ చండీ హోమం నిర్వహిస్తామన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణానికి రాయితీలు



మాట్లాడుతున్న శామ్యుల్ జాన్సన్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కొత్త నవరసపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం సర్పంచి ఈదా జగ్జీవన్‌రావు అధ్యక్షతన జరిగింది. వ్యవసాయశాఖ అధికారి శామ్యుల్ జాన్సన్ ఖరీఫ్ సాగులో రైతులు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. మండల పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఇంజేటి సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు 90 శాతం రాయితీపై గోకులం షెడ్లు మంజూరు చేస్తుందన్నారు.

పోడూరు, న్యూస్‌టుడే: మట్టపర్రు, జిన్నూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచులు దొమ్మేటి శ్రీను, జమ్మ బేబీ మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఏవో సత్యనారాయణ పలు విషయాలు వివరించారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే : పోలమూరు, మాముడూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో జ్యోషిలా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరించారు. ఎండాకు తెగులు తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచనలు, సలహాల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రేమాన్వితకు కార్యదర్శుల అభినందన

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎన్.ప్రేమాన్విత బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఉంగుటూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇటీవల వరకు ఎంపీడీవోగా కొనసాగిన త్రిశూలపాణి మొగల్తూరుకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోను ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచులు, కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆదమరిస్తే...అంతే...!



రామన్నపాలెం వద్ద రహదారి ఇలా

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రధాన రహదారులు గోతులు, రాళ్లు లేచి అధ్వానంగా మారాయి. పెనుగొండ మండలంలోని సిద్ధాంతం- పెనుగొండ ఆర్ అండ్ బీ రహదారి సుమారు ఎనిమిది కిలోమీటర్లు ఉండగా, సిద్ధాంతం, రామన్నపాలెం, వడలి, మల్లపదిబ్బ గ్రామాల పరిధిలో భారీగా గోతులు ఏర్పడ్డాయి. రహదారి గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలు సాగించేవారికి అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి తక్షణం వాటిని పూడ్చాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా పశువుల ఆసుపత్రి నిర్వహణ



పశువుల షెడ్డులో పెట్టిన వాహనాలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు యడ్లబజార్ ప్రాంతంలోని పశువుల ఆసుపత్రి నిర్వహణ విమర్శలకు దారితీస్తుంది. పశువులు ఉంచాల్సిన షెడ్డులో సిబ్బంది వాహనాలు పెడుతున్నారు. అదే సమయంలో పశువులు వస్తే ఆరుబయట ఎండలో లేదా వర్షంలో ఉంచుతున్నారని పలువురు వాపోతున్నారు. పశువుల ఆసుపత్రికి దాతలు కేటాయించిన స్థలాన్ని సద్వినియోగం చేయని పశుసంవర్ధక శాఖ నిర్వహణను గాలికి వదిలేసిందని స్థానికులు వాపోతున్నారు.

28లోపు ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేయాలి

మొగల్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్తు ప్రణాళికపై ఈ నెల 28 లోపు ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేయాలని ఎంపీడీవో త్రిశూలపాణి సూచించారు. మొగల్తూరు మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. దీనిపై పలు సూచనలు చేశారు.

విద్యాశాఖ ప్రతినిధులతో సమావేశం

పోడూరు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 సాధనలో ప్రతి భాగస్వాములు కావాలని స్థానిక తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విద్యా శాఖ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఈ విషయంలో చైతన్యవంతం చేయాలన్నారు.

ప్రేమ పేరుతో మోసం

యలమంచిలి, న్యూస్‌టుడే: తనను ప్రేమించానని మాయమాటలు చెప్పి పోడూరు మండలం పైడావకు చెందిన యువకుడు మోసగించాడని మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక యలమంచిలి పోలీస్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే : అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ మార్లింగం అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి జిల్లా పరిషత్ పాఠశాల లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సచివాలయ, అంగన్‌వాడీ, ఆశా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణ భాజపా ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి బుధవారం నిర్వహించారు. పార్టీ నాయకులు ముందుగా ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మొక్క నాటారు.

కల్తీ నెయ్యి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మొగల్తూరు, న్యూస్‌టుడే: తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ధార్మిక సంఘాల సభ్యులు, నేతలు ప్రభుత్వాన్ని కోరారు. మొగల్తూరు దియాల్‌దాస్‌పేట వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి లాకు ప్రాంతం వరకూ ధార్మిక సంఘాల సభ్యులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. మహిళా మండలి సభ్యులు, ఆర్ఎస్ఎస్, భజరంగదళ్ తదితర హిందూధార్మికసంఘాల సభ్యులు, తెదేపా, భాజపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న సమితి సభ్యులు

ధర్మాన్ని కాపాడగలిగే వారికే పదవులు ఇవ్వాలి : జోగయ్య.. పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ పాలనలో కల్తీ నెయ్యి వాడి శ్రీవారి ప్రసాదం పవిత్రతను కాపాడటంలో పూర్తి నిర్లక్ష్యం వహించారని మాజీ ఎంపీ చేగొండి వెంకట హరరామజోగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు అధ్యక్షుడు, సభ్యులు, ఉద్యోగులను బాధ్యులను చేస్తూ నిందితులకు శిక్షలు విధించాలని భక్తులు కోరుతున్నారన్నారు. స్వామి భక్తి లేనివారికి ఇంత ముఖ్యమైన పదవులు ఇస్తే ఇటువంటి వాటికి దారి తీస్తుందని తెలిపారు. సనాతన ధర్మాన్ని కాపాడగల శక్తివంతులకు మాత్రమే పాలకమండలిలో అవకాశం ఉండాలని పేర్కొన్నారు.



మొగల్తూరు: ధార్మిక సంఘాల సభ్యులు, నాయకుల ప్రదర్శన

వేంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు.. పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రం కావడంపై పాలకొల్లు పట్టణం ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. కెనాల్ రోడ్డు భూదేవి, శ్రీదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు పంచామృతాలతో స్వామికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గాదె వెంకన్న, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపకూడదు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆడ, మగ అనే లింగ వివక్ష చూపకూడదని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవతి కోరారు. తణుకు కోర్టు భవనంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మహిళలపై గౌరవం కలిగి ఉండాలని కోరారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి సత్యకృష్ణలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తి సాయిరాం, రంజిత్ కుమార్, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ చిరంజీవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఆరా

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా ఆసుపత్రిలో ఒప్పంద పారిశుద్ధ్య, సిబ్బంది పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు, వేతనాలు చెల్లించడం లేదని ఇటీవల కార్మికులు కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. నరసాపురం సహాయ కార్మిక శాఖ కమిషనర్ నాగలక్ష్మి బుధవారం ఆసుపత్రిని సందర్శించి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయమని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ అధికారి లక్ష్మణరావు, జిల్లా కేంద్ర ఆసుపత్రి పర్యవేక్షణాధికారిణి అరుణ, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

నరసాపురం, న్యూస్‌టుడే: ఎల్‌బీచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు.



విద్యార్థినుల ప్రదర్శన

మీ ఆరోగ్యానికి మాది భరోసా

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రపంచ ఫార్మసీ దినోత్సవం సందర్భంగా యలమంచిలి మండలం కలగంపూడి జిట్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాలకొల్లులో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. మీఆరోగ్యానికి మాది భరోసా అనే నినాదాలతో కూడిన ప్లకార్డులు చేతపట్టి గాంధీ బొమ్మల కూడలి నుంచి ప్రధాన మార్గంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల డైరెక్టర్ డాక్టర్ చేగొండి నారాయణరావు ప్రారంభించారు. ఫార్మసీ లోగో నమూనాలో విద్యార్థులు ఒదిగి ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ప్రాంగణంలో ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ప్రిన్సిపల్ టి.అశోక్ మాట్లాడారు. ఆచార్యులు హీరా భట్టు, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

లింగ వివక్ష చూపకూడదు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆడ, మగ అనే లింగ వివక్ష చూపకూడదని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవతి కోరారు. తణుకు కోర్టు భవనంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మహిళలపై గౌరవం కలిగి ఉండాలని కోరారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి సత్యకృష్ణవంత, జూనియర్ సివిల్ న్యాయమూర్తి సాయిరాం, రంజిత్ కుమార్, స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ చిరంజీవి, న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యవతి

ఫార్మసిస్టుల దినోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ప్రాంగణంలో ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ప్రిన్సిపల్ టి.అశోక్ మాట్లాడారు. ఆచార్యులు హీరా భట్టు, లిఖిత తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు

కార్మికుల సమస్యలపై ఆరా

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రిలో ఒప్పంద పారిశుద్ధ్య సిబ్బంది పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు, వేతనాలు చెల్లించడం లేదని ఐటీవల కార్మికులు కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. నరసాపురం సహాయ కార్మికశాఖ కమిషనర్ నాగలక్ష్మి బుధవారం ఆసుపత్రిని సందర్శించి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేయమని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ అధికారి లక్ష్మణరావు, జిల్లా కేంద్ర ఆసుపత్రి పర్యవేక్షణాధికారిణి అరుణ, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులతో నాగలక్ష్మి

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ ప్రభాకరరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

వామ్మో.. ఇవేం ధరలు

పెరిగిన కూరగాయల ధరలు



తాడేపల్లిగూడెం అర్బన్, వటుపర్, న్యూస్‌టుడే:

ఉల్లి ధర కన్నీరు తెప్పిస్తోంది. ఆనపు అందనంటోంది. ఇదే కాదు వంకాయ నుంచి టమాటా వరకు ఏ కూరగాయ ధర చూసినా సామాన్యులకు అందని పరిస్థితి నెలకొంది. తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. వర్షాకాలంలో కూరగాయల దిగుబడి తక్కువగా ఉండటంతో కొంత మేర ధరల వ్యత్యాసం ఉండటం సహజమే. కానీ ఈ ఏడాది వచ్చిన వరదలతో కూరగాయల తోటలు నీటమునిగాయి. దీని ఆధారంగా ధరలు పెరిగిపోయాయి. సామాన్యుల బడ్జెట్ తలకిందులు చేసే విధంగా ధరలు మండిపోతున్నాయి.

● ఉభయ గోదావరి జిల్లాలోని లంక గ్రామాలు, మదనపల్లి నుంచి పెద్ద మొత్తంలో గూడెం మార్కెట్‌కు టమాట దిగుమతి అవుతోంది. నెల కిందట వరకు టమాట కిలో రూ.30 ఉంటే ప్రస్తుతం రూ.60కు పెరిగింది.

● మూడు వారాల కిందట కిలో రూ.40 ఉండే వంకాయలు ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.90 పలుకుతున్నాయి.

● కొన్ని రోజుల కిందట కిలో రూ.40 ఉండే బీర ధర ప్రస్తుతం రూ.60 ఉంది.

● ఒకప్పుడు గూడెం మార్కెట్‌కు రోజుకు 250 టన్నుల ఉల్లి వచ్చేది. ఇక్కడ నుంచి దేశ నలుమూలలకు ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం రోజుకు సగటున 100 టన్నులు రావడం కష్టంగా మారింది.

"ఒకప్పుడు రూ.500 పెడితే ఎలాంటి ఇబ్బంది లేకుండా వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం రెట్టింపు స్థాయిలో ఖర్చు చేయాల్సి వస్తోంది." అని పట్టణానికి చెందిన శ్రీలక్ష్మి వాపోయారు.





"కూరగాయలకు నెలవారీ కేటాయించే డబ్బులు ఏమాత్రం సరిపోవడంలేదు. పెరిగిన ధరలతో ఏం కొనాలో తెలియని పరిస్థితి నెలకొంది" అని రామతులసి ఆవేదన వ్యక్తం చేశారు.

అత్తిలి పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య : అత్తిలి మార్కెట్ నుంచి బొంతువానిపాలెం వెళ్లే మార్గంలోని బీసీ భవనానికి మురుగుబోదె చెత్తతో మేట వేసింది.
- భాను, స్థానికుడు

సమాధానం : సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.
- సుజాత, పంచాయతీ కార్యదర్శి

సమస్య : అత్తిలి నుంచి గుమ్మంపాడు రహదారి గుంతలతో అధ్వానంగా ఉంది.
- మహేష్, వాహనచోదకుడు

సమాధానం : అధికారులకు ప్రతిపాదనలు పంపించాం.
- రవి, ఏఈ

సమస్య : మంచిలి పంచాయతీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.
- నాగు, స్థానికుడు

సమాధానం : సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం
- వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

సమస్య : కంచుమర్రు గ్రామం గరువు ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు.
- రాజు, స్థానికుడు

సమాధానం : సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం
- భాస్కర్, పంచాయతీ కార్యదర్శి

వంద రోజుల్లోనే హామీల అమలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర సమగ్ర ప్రగతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకెళ్తున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం వేల్పూరులో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వంద రోజుల్లోనే పెంచిన పింఛన్లు అందించడం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు, డీఎస్సీ నోటిఫికేషన్, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం దాదాపు, కక్షపూరిత రాజకీయాలకు పాల్పడిందని దుయ్యబట్టారు. మాజీ మంత్రి కారుమూరి వేల్పూరులో అభివృద్ధిని అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. గాజులు, దుస్తులు, పండ్లు అందించారు.


గర్భిణులతో ఎమ్మెల్యే రాధాకృష్ణ

బాధితులకు పరామర్శ.. తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు శివారు నారాయణపురంలో ఐటీవల నామాల సత్యనారాయణ, చిన సత్యనారాయణలకు చెందిన ఇళ్లు ఐటీవల అగ్నిప్రమాదానికి గురయ్యాయి. బుధవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.పది వేలు ఆర్థిక సాయం, 25కేజీల బియ్యం అందించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

అందుబాటులో ఎరువులు: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంటకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించే పంటను వ్యవసాయ శాఖ ఆర్బీకేల సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. పంట దిగుబడి పెంచుకునేందుకు నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్య తక్షణం పరిష్కరించాలన్నారు. రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్, వలవల బాబ్జీ తదితరులు


క్షేత్రంలో అధికారులు, రైతులు

పెంటపాడు, న్యూస్‌టుడే: పెంటపాడు మండలం కస్పాపెంటపాడులో బుధవారం సర్పంచి పీతల సత్యనారాయణ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సిబ్బంది పురుగుమందుల అతిగా వినియోగించకుండా పంటలో మెరుగైన దిగుబడులు సాధించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నరాలశెట్టి సంతోష్, యిమ్మంది లక్ష్మయ్య, యిమ్మంది శ్రీను, రైతులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ సూచించారు. కోమరవరం, దువ్వ గ్రామాల్లో బుధవారం ఏవో కుసుమ అధ్యక్షతన 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు ప్రారంభించే 20 రోజుల ముందుగా గన్నీ బ్యాగ్‌లు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని అధికారులను రైతులు కోరారు. వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పండు, ఈశ్వరరావు, సత్తియ్య వ్యవసాయ సహాయకులు అరుణకుమార్, రైతులు పాల్గొన్నారు.

అత్తిలి పట్టణం, న్యూస్‌టుడే: గుమ్మంపాడు, ఉరదాళ్లపాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పాలనతో మన్ననలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్డీయే ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం కొత్తూరులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించి వేలాది మంది పేదల ఆకలి తీర్చుతున్నట్లు తెలిపారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి భవన నిర్మాణ కార్మికుల సమస్య పరిష్కరించారని పేర్కొన్నారు. అనంతరం పండిట్ దీన్ దయాళ్‌కు నివాళులు అర్పించారు.


నివాళులు చేస్తున్న భాజపా నేతలు

దీన్‌దయాళ్‌కు నివాళి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో భాజపా ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దీన్‌దయాళ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, నారాయణ, కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

మండపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: మండపేట గొల్లపుంత కాలనీకి చెందిన మేకా శివశ్యామ్, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆసెట్టి నగేష్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. బుధవారం వీరిని ఆలమూరు జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచామన్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన పట్టణ ఎస్సై హరికోటిశాస్త్రి, రూరల్ ఎస్సై డి.సురేష్, సిబ్బంది ఎన్.సతీష్, జి.రమేష్, సత్యకుమార్‌స్వామిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం



అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి బస్టాండ్ సమీపంలోని చిన్న హరిజనపేటలో మురుగు కాలువలో మురుగుపారక రహదారిపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. దోమలు కుటి మలేరియా, డెంగీ వంటి జ్వరాల బారిన పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడు నుంచి దసరా ఉత్సవాలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలోని శ్రీబాలా త్రిపుర సుందరి దేవి పంచాయతన క్షేత్రంలో ఈ నెల 3 నుంచి 13 వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరామ సిద్ధాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవరాత్రుల్లో వివిధ అలంకారాలు, ప్రతిరోజు సంపూర్ణ చండీ హోమం నిర్వహిస్తామన్నారు.

ఓపిక ఉంటేనే వైద్యం..!

సాంకేతిక సమస్యలతో వెతలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే

తణుకు జిల్లా ఆసుపత్రిలో ఆన్‌లైన్ ఓపీ కోసం రోగులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. దూర ప్రాంతాల నుంచి రోగులు రోజూ అధిక సంఖ్యలో ఇక్కడకొస్తుంటారు. సుమారు 400కు పైగా ప్రతి రోజు ఓపీ ఉంటుంది. దీని కోసం గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎంతో ఉపయోగం ఉన్నా..

వైద్యం నుంచి మందుల వరకు అన్నీ ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. ఏ ప్రభుత్వాసుపత్రికెళ్లినా ఆధార్ నంబరు కొట్టగానే రోగి వివరాలు వెంటనే తెలుసుకోవచ్చు. దీంతో సులువుగా వైద్యం పొందడానికి వెసులుబాటు ఉంది. ఎక్కువ సంఖ్యలో ఆన్‌లైన్ నమోదు చేస్తే ప్రోత్సాహకాలు ఇస్తారు. వీటిని ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించుకోవచ్చు.

● కానీ ఆన్‌లైన్ ఓపీ వల్ల ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను అధిగమించలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో ప్రతి రోజు ఉదయం ఒకే సమయంలో ఓపీలు ప్రారంభించడంతో సర్వర్ నెమ్మదిస్తుంది. రోగులు క్యూలైన్ల వద్ద బారులుదీరుతున్నారు. ఒక్కొక్క ఓపీ కోసం సుమారు పది నిమిషాల సమయం పడుతోంది.


ఓపీ తీసుకునేందుకు మహిళల ఇక్కట్లు

సిబ్బంది కొరత..

ఆస్పత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. రెండు నెలల నుంచి సిబ్బంది సెలవులో ఉన్నారు. అయితే ఇక్కడ ఆన్‌లైన్ ఓపీ తీసుకునేందుకు క్యూఆర్ కోడ్ ఉన్నా...రోగుల వద్ద ఆండ్రాయిడ్ చరవాణులు లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి.

సదుపాయాలు కొరవడి..

ఓపీ విభాగం వద్ద సరైన సదుపాయాలు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. కూర్చునేందుకు రెండు బల్లలు ఉన్నా...సరైన మంచినీటి సౌకర్యం లేదు. ఇక్కడకొచ్చే వారిలో ఎక్కువగా వృద్ధులు, చంటి పిల్లల మహిళలే ఉంటారు. క్యూలైన్ల వద్ద నీరసించిపోతున్నారు. దీనిపై సూపరింటెండెంట్ అరుణ స్పందిస్తూ...'సర్వర్ నెమ్మదిగా ఉండటంతో సమస్య ఏర్పడుతోంది. సిబ్బంది కొరత లేకుండా చూస్తాం. ఓపీ వద్ద కూర్చునేందుకు బల్లలు అందుబాటులో ఉన్నాయి కానీ స్థలం తక్కువగా ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయి' అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి త్రో బాల్ పోటీల్లో తణుకు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మోహనిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో తరుణ్, చరణ్, అండర్-17 విభాగంలో గణేశ్, శ్యామ్, భార్గవ్, ఎల్లపరాజు, అభిషేక్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబరులో పల్నాడులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.



జిల్లా స్థాయి పోటీలకు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలం అత్తిలి జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు దివ్య, రూప్సీ, ప్రవంతి, లక్ష్మీ ప్రియ, తేజ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి తెలిపారు.


ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు

దువ్వ విద్యార్థుల ప్రతిభ..

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో దువ్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరేంద్ర, దుర్గ, శ్రీలక్ష్మి, దుర్గాగాయత్రి ఎంపికయ్యారన్నారు.

సైకిల్ షెడ్ లేక వెతలు



అత్తిలి పట్టణం, న్యూస్‌టుడే: అత్తిలి ఇందిరాగాంధీ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో సైకిల్ షెడ్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సైకిళ్లను ఆరుబయటే నిలుపుతుండటంతో మరమ్మతుకు గురవుతున్నాయని వాపోతున్నారు.

చినుకు పడితే చింతే..

టార్పాలిన్ల కోసం రైతుల నిరీక్షణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:

ఆరుగాలం శ్రమించే రైతన్నలకు అడుగడుగునా ఆటంకాలే. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి దిగుబడులు సాధించినా అవి కాస్తా వర్షార్పణం అవుతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు వినియోగించే టార్పలిన్ల రాయితీలను గత ప్రభుత్వం రద్దు చేసింది. ధాన్యం తడిచి, మొలకలు వచ్చి రైతులు నష్టపోయారు. ఈ సమస్య నుంచి రైతన్నలను గట్టెక్కించడానికి ఎన్డీయే సర్కారు బరకాలు సరఫరా చేసే దిశగా అడుగులు వేస్తోంది. 2014లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రాయితీపై వీటిని అందించేవారు. దీని వల్ల సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది.

మండలం	ఎకరాలు	రైతులు	టార్పాలిన్ల అవసరం
తణుకు	12507	7020	5000
ఇరగవరం	13904	7262	4800
అత్తిలి	15018	9000	6000


బరకాలతో ధాన్యాన్ని కప్పిన రైతులు (పాతచిత్రం)

మొదలైన కసరత్తు

నియోజకవర్గంలో సొంతంగా ఎన్ని టార్పాలిన్లు ఉన్నాయి. ఇంకా ఎన్ని అవసరం అవుతాయనే దానిపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఐటీవల మండలాల వారీగా ప్రతిపాదనలు పంపారు. నియోజకవర్గంలో 41,429 ఎకరాలు ఉండగా 23,282 మంది రైతులు సాగు చేస్తున్నారు. వీరికి 15,800 పట్టాలు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే క్షేత్రస్థాయిలో ఒక్కటే పంపిణీ చేయకపోవడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.